# శిరస్త్రాణాయ విధానం

ఆ రోజు పేపర్లో మొట్ట మొదటిసారి ఆ వార్త ప్రచురింపబడినప్పటి నుండి సుబ్బారావు సమస్య మొదలయ్యింది

స్కూటర్లు, మోటర్ సైకిళ్లు, నడిపే వాళ్ళందరూ ఫలానా పద్ధతుల ప్రకారం తయారు చేసిన సేఫ్టీ హెల్మెట్లు దరించాలని అల్లా దరించకపోతే, దరించనివారి పీక తీసేస్తారని ఆ వార్త సారాంశం ఇలా హెల్మెట్లు ధరించాలి అనే రూల్లో లేదు అసలు సమస్య ఆ హెల్మెట్ కింద వుండవలసిన సుబ్బారావు బుర్రలో వుంది'

సుబ్బారావుకి వున్న బలహీనత ఏమిటంటే హద్దులు మించిన మొహమాటం . ఎవడేది చెప్పినా గొర్రెలాగ తలవూపి ఆచరించెయ్యటం ఈ వార్త పేపర్లో చూడగానే సర్వీసేశ్వ ్రావ్ (ఆయన అసలుపేరు సర్వేశ్వరరావు కాని అతనన్ని ప్రజాహిత కార్యక్రమాలలోకి జొరబడి పని చేస్తుంటాడని ముద్దుగా సర్వీసేశ్వర్రావ్ అని పిలుస్తారంతా!) హెల్మెట్లు హోల్‌సేల్ పర్చేజ్ కార్యక్రమం చేపట్టాడు అతను అడగ్గానే నూట ఎనభై రూపాయలు యిచ్చేసాడు సుబ్బారావు అందరి వద్ద డబ్బులు కలెక్ట్ చేసిన సర్వీసేశ్వర్రావ్ స్వంత ఖర్చులు మీద కలకత్తా వెళ్ళి, బజార్లన్నీ గాలించి, హెల్మెట్లకి మంచి గిరాకీ వున్న తరుణంలో రెండు వందల హెల్మెట్లు కొని తెచ్చాడు

తనకు నచ్చిన రంగు కాక, మరొకడు మెచ్చి, ప్రతిపాదించిన రంగు హెల్మెట్ తీసుకొన్నాడు సుబ్బారావ్ అది కాస్త యిరుకుగా వున్నాసరే ఆ రోజంతా పెట్టుకు తిరిగేడు సాయంత్రానికి మెడజీవాలు నెప్పిపెట్టి, మెడ యిరుకు పట్టేసింది

మర్నాడు ఎవరో ఆఫీసుకి కొత్త వార్త మోసుకొచ్చారు హైదరాబాద్ పోలీసు కమీషనర్ హెల్మెట్లు పెట్టుకోవలసిన గడువుతేదీ పదిహేను రోజులు పొడిగించినట్లు ప్రకటించారని ఆ వార్త సారాంశం 'హమ్మయ్య!' అనుకొని ఆ రోజు నుంచి హెల్మెట్ మూలన పడేసాడు సుబ్బారావు మూడో రోజు పోలీసులు పట్టుకొన్నారు హెల్మెట్ పెట్టుకోలేదని ఆ రోజు దొరికిన సుమారు రెండు వందల మందిలోనూ, చాలాభాగం ఇలాంటి చట్టాలు అమలుపరచబడే విషయంలో నమ్మకం లేక" హెల్మెట్లు కొనుక్కోనివారో అందరూ తలొక యిరవై రూపాయలు కట్టేసారు సుబ్బారావులాగ హెల్మెట్లు కొనుక్కొని కూడా పెట్టుకోనివారొక పదిమంది వున్నారు సుబ్బారావు గోల పెట్టాడు. హైదరాబాద్ పోలీస్ కమీషనర్ ప్రకటించిన గడువు పొడిగింపు గురించి ప్రస్తావించాడు అది జంట నగరాలకే కాని విశాఖపట్నానికి వర్తించదని కొట్టి పారేసారు పోలీసులు సుబ్బారావు మళ్ళీ హెల్మెట్ వేసుకోవటం మొదలు పెట్టాడు, యిరవై రూపాయల జెల్లతో

మరుసటివారం మరొక కొత్త వార్త వచ్చింది హైదరాబాద్‌లో ఎవరో పెద్ద మనిషి ఈ రూలు పెట్టినతని కాంపిటెన్సీని ఛాలెంజ్ చేస్తూ కోర్టులో కేసువేసాడని అంచేత ప్రస్తుతం ఈ రూలుకి స్టే వచ్చిందని తెలిసింది మళ్ళీ అందరూ హెల్మెట్సు పెట్టుకోవటం మానేసారు సుబ్బారావు తెగించి ఒక రోజంతా హెల్మెట్ పెట్టుకు తిరిగితే అంతా నవ్వేరు మళ్ళీ సుబ్బారావు పెట్టుకోవటం మానేసాడు అకస్మాత్తుగా మరొక వారంలో చెకింగ్ జరిగి యిరవై వడ్డించేరు సుబ్బారావుకి లబోదిబోమన్నాడు సుబ్బారావు ఆ స్టే వెకేట్ చేసేసారని యిరవై రూపాయల జెల్లతో తెలిసింది మళ్ళీ హెల్మెట్ పెట్టుకోవటం మొదలు పెట్టాడు సుబ్బారావు

ఇది జరిగి పదిరోజుల్నాడు పేపర్లో మరొక వార్త పడింది హైదరాబాద్‌లో ఒక లాయరు వేసిన కేసులో ఈ రూల్ పాస్‌చేసిన అదికారికి అటువంటి అధికారం లేదని కోర్టు తీర్పు యిచ్చిందట మళ్ళా అంతా, సుబ్బారావుతో బాటు హెల్మెట్లు పెట్టుకోవటం మానేసారు ఆ మరుసటి వారం చెకింగ్ జరిగి, సుబ్బారావుకి మరొక ఏభై వదిలింది మళ్ళా లబోదిబోలు మామూలే ఈ సారి సరియైన అదికారికమైన ఆజ్ఞలు వచ్చేయన్న సంగతి తెలియడానికి సుబ్బారావుకి మరొక ఏభై ఖర్చయింది

ఎవర్నూ పెట్టుకోకపోయినా హెల్మెట్ పెట్టుకొని వారం రోజులు తిరిగాడు సుబ్బారావు ఆ రోజు పేపర్లో హెల్మెట్లు పెట్టుకోవాలన్న హెచ్చరిక క్రిందనే హెల్మెట్ పెట్టుకోవాలన్న రూల్‌కి స్టే అర్డర్‌చ్చినట్టు దాని కోర్టు రిఫరెన్సు నెంబరు ఫలానా అని ఎవరయినా, ఆ రిఫరెన్సు కోట్ చెయ్యవచ్చు అని ఆ లాయరుగారి ప్రకటన వుంది

మళ్ళీ హెల్మెట్ పెట్టుకోవటం మానేసాడు సుబ్బారావు అందరూ తనని చూసి నవ్వుతున్నారని

ఇది జరిగిన అయిదో రోజునే చెకింగ్ అయి, సుబ్బారావ్ స్కూటర్ లాక్‌చేసి, తాళాలు పట్టుకు పోయాడు కానిస్టేబుల్

కానిస్టేబుల్ దగ్గర కోర్టు రిఫరెన్సు చెప్పినా లాభం లేకపోయేసరికి, హెడ్డుగారి దగ్గర కెళ్ళాడు సుబ్బారావు అక్కడ సుబ్బారావు బళ్ళలాంటివి సుమారు రెండు వందలు లాక్ చెయ్యబడివున్నాయి

తప్పదు మేష్టారు ఆ స్టే కేసు వేసిన లాయరుగారికి మాత్రమే సంబందించినది మీకు వర్తించదు "

బాబ్బాబు ఈ ఒక్కసారికీ

'ముప్పై కట్టేస్తే పోయేదానికి ఈ టైము వేస్ట్ ఎందుకు సార్ '

ముప్పైఏంటిసార్ ఇరవైకదా?


'మీరు వేస్ట్ చేసే మా ప్రతినిమిషానికి ఫైన్ పదేసి పెరుగుతుంది ఒరేయ్ రాములూ! 'ఈయన బండి వేన్ ఎక్కించి స్టేషన్‌లో పెట్టు రేపు తీసుకొంటారు . నలభైకట్టి '

గప్‌చిప్!

సుబ్బారావు డబ్బు కట్టేద్దామంటే జేబులో డబ్బులులేవు పదిరూపాయలు రానూ పోనూ మాట్లాడుకొని ఆటోలో యింటికెళ్ళి డబ్బులు తెచ్చాడు

డబ్బు కట్టే చోట చాలా రద్దీగా వుంది

రెండు మూడు వందల 'సి బుక్కులు' 'లైసెన్సులు' "తాళం' చెవుల గుత్తులు' రాసులు





పోసివున్నాయి ఇద్దరు మనుషులు హో రాహోరీగా- ఒకరు కేస్ షీటు- ఒకరు ముట్టిన డబ్బుకి రసీదు రాస్తూన్నప్పటికీ- క్యూ తరగటంలేదు

కాలం గడుస్తున్నకొద్దీ ఆ రద్దీలో తన తాళం చెవులు ఎవడు పట్టుకు పోతాడో అనే బయం పట్టుకొంది సుబ్బారావుకి

చివరికి చచ్చీ చెడి చేయంగల విన్నపాలుగా మూడు గంటల తర్వాత డబ్బుకట్టిన రసీదుతో బయటకొచ్చి, ఆ తాళం చెవుల కోసం బ్లాక్ మార్కెట్ వాడిలాగా గుంపులోకి జొరబడి జుత్తు రేపుకొని, లాల్చీ చింపుకొని, బుగ్గ గీచుకుపోయి, రెండు లాఠీ దెబ్బలకి బలి అయ్యాక స్వేచ్ఛా వాయువులు పీల్చాడు. సుబ్బారావు

మర్నాడు హెల్మెట్ పెట్టుకొని స్కూటర్ మీద ఆఫీసుకెళ్ళగానే, యిద్దరు ముగ్గురు వింతగా చూసారు సుబ్బారావుని మరొక పావుగంటకి ఒక స్నేహితుడు పలకరించాడు సుబ్బారావుని

"ఈ వేళ పేపరు చూడలేదుగురూ' హెల్మెట్ పెట్టుకోమని నిర్బంధించిన యిద్దరు పోలీసు కానిస్టేబుళ్ళు అరెస్టయ్యారట' నువ్వింకా హెల్మెట్ ఎందుకు పెట్టుకుంటున్నావ్? సుబ్బారావ్ టేబిల్‌మీదకి మెడసాచి అతని మొహంలోకి చూస్తూ అడిగాడు ఆ స్నేహితుడు

సుబ్బారావు మొదట నిస్తేజంగా చూసాడు స్నేహితుడి మొహంలోకి తర్వాత బేలగా చూసాడు తర్వాత కోపంగా చూసాడు తర్వాత ఆశ్చర్యంగా చూసాడు తర్వాత నవ్వుతూ చూసాడు తర్వాత అసహ్యంగా చూసాడు తర్వాత భయంగా చూసాడు తర్వాత ఆశగా చూసాడు తర్వాత నిరాశగా చూసాడు తర్వాత భోరుమని ఏడిచి, ఫైలు చింపేసి, బల్లఎక్కి నాలుగుసార్లు గెంతి, సరిగ్గా సీట్లో కూర్చొని, అలా అలా సీటుకి చేరగిలబడి స్పృహతప్పి పోయాడు

ఈ వికారమంతా చూసిన స్నేహబృందం గాభరాగా ఆస్పత్రికి మోయసాగారు సుబ్బారావుని

తెలివొచ్చాక 'నేనెక్కడున్నాను?" అని అడగలేదు

నా హెల్మెట్టేది? అని తెలివి వచ్చిన వెంటనే అడిగేడు. సుబ్బారావు

స్నేహితులు గాబరాపడ్డారు

యింటి దగ్గర వుంది'

'తక్షణం తీసుకురండి ఈ క్షణం నుంచి యింటా బయటా, స్కూటరు తీసినా, తీయకున్నా ఒక్క క్షౌరం చేయించుకొనే సమయంలోను, తలకి నీళ్ళు పోసుకొనే సమయంలోనూ తప్ప. నేను అహర్నిశలూ హెల్మెట్ వేసుకొనే తిరుగుతాను ఈ కమ్యూనికేషన్ కన్ఫ్యూజన్‌లో రోజుకో యిరవై పెనాల్టీ మూడేసి గంటల కత్తి యుద్ధాలూ భరించలేను నా కాష్టంమీద కూడా శవాన్ని హెల్మెట్‌తోనే కాల్చాలని నా పిల్లలకి చెప్పండీ.. వెళ్ళండి బాబూ వెళ్ళండి నా హెల్మెట్ తెండి.. అంతవరకూ బ్రతకలేను." అంటూ ధామ్మని పడిపోయి స్పృహతప్పిపోయాడు పాపం సుబ్బారావు □